క్లుప్తంగా

అంకితభావంతో పని చేయాలి



కరికెర ప్రాథమిక పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ-2 రవిచంద్ర కుమార్

గుడిబండ: మండలంలోని ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని ఎంఈఓ-2 రవిచంద్రకుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కరికెర, కె.ఎస్.పల్లి ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు పట్టికను పరిశీలించారు. మండలంలోయ ఏకోపాధ్యాయ పాఠశాలలు లేవన్నారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా విద్యా బోధన చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

బాధ్యతగా పని చేస్తేనే గుర్తింపు



బదిలీ అయిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

మడకశిరరూరల్: ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేసి, విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి అన్నారు. దలంలోని బుళ్లసముద్రం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సుబ్బారావు, సరస్వతమ్మ, లీలావతి, ఉగ్ర నర సింహులు, భానుచంద్ర, శ్రీనాథ్, ప్రేమలత, వసంతలక్ష్మి, అంజినప్ప, హరినాథ్‌రెడ్డి ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. శనివారం పాఠశాలలో వీరిని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథ్, సర్పంచ్ రంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, మాజీ సర్పంచ్ జైపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు



గ్రామస్తులతో వైద్య బృందం

హిందూపురం అర్బన్: కొటిపి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వాసవ్య మహిళా మండలి, కుషాల్ హెల్త్‌కేర్, విప్రో కేర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 120 మందికి పైగా ఉచిత వైద్య సేవలు పొందినట్లు వైద్యుడు చక్రతేజా రెడ్డి తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు జ్వరం, ఒళ్లనొప్పులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతన్న వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. వైద్య శిబిరంలో కుశాల్ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

8 వాహనాల సీజ్

మడకశిర: నియోజకవర్గంలో శనివారం హిందూపురం ఆర్టీఏ అధికారులు దాడులు నిర్వహించారు. ఎంవీఐ శివశంకర్ ఆధ్వర్యంలో మడకశిర, అమరాపురం మండలాల్లో సిబ్బంది విస్తృతంగా దాడులు చేసి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 8 వాహనాలను సీజ్ చేశారు. రూ. 1.50 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఎంవీఐ శివశంకర్ తెలిపారు. అక్రమంగా తిరుగుతున్న వాహనాలను అరికట్టడానికి క్రమం తప్పకుండా దాడులు చేస్తామన్నారు.

రూ.1.5 లక్షల నగదు చోరీ

అమరాపురం: మండల పరిధిలోని వలస గ్రామంలో నివాసం ఉంటున్న సుశీలమ్మ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టారు. బీరువాలో దాచిన రూ.1.5 లక్షలు, రెండు వెండి గిన్నెలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు వాపోయింది. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గోవధ నిషేధించాలి



తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలో గోవధను నిషేధించాలని విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ప్రసాద్, విజయకుమార్ కోరారు. శనివారం వారు తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్.ఐ.వెంకటేశ్వర్లుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అమరాపురం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు గోవులను వధించడానికి తీసుకెళ్తున్నారన్నారు. గోమాతను చంపితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హిందువులు పవిత్రంగా పూజించే గోమాతలను వధించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గోమాతలను ఇతర ప్రాంతాలకు తరలించే వాహనాలను సీజ్ చేయాలని కోరారు.

మాకు పథకాలన్నీ అందాయి

- మళ్లీ జగనన్నే సీఎంగా ఉండాలి
- ఆయనతోనే ప్రజా సంక్షేమం సాధ్యం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం



పథకాలు అందుతున్నాయా? అంటూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: ప్రభుత్వ పథకాలన్నీ వలంటీర్లు ఇంటి ముంగిటకే వచ్చి అందిస్తున్నారు. ఇంతకన్న మాకు ఏం కావాలి. మళ్లీ జగనన్నే సీఎంగా ఉండాలి అని 19వ వార్డు మహిళ గౌరమ్మ ఆకాంక్షించింది. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆధ్వర్యంలో 19వ వార్డులోని ఏడుగురు అక్కమ్మ దేవి ఆలయ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే చెప్పాలని కోరారు. తాము సేవలు అందించడానికి ప్రతి గడపకు వస్తున్నామని తెలిపారు. పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

సేవలందించేందుకే వస్తున్నాం..

సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి గుడ్‌బాయ్ చెప్పాలన్నారు. జగన్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. నాలుగేళ్ల జగనన్న పాలనలో అందరికీ మేలు జరిగిందన్నారు. జనం గుండెల్లో జగనన్న చోటు సంపాదించుకున్నారని వెల్లడించారు. మరోమారు జగనన్నకు పట్టం కట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ ముగ్గురు కలిసి ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరన్నారు. ప్రజలు జగనన్నే మళ్లీ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు నాగేంద్ర బాబు, మల్లికార్జున, ఆయుబ్, రోషన్, రహమత్‌బీ, జిల్లా యువత అధ్యక్షుడు లోకేష్, జేసీఎస్ కన్వీనర్లు నౌషాద్, శివశంకర్ రెడ్డి, పార్టీ నాయకులు సోమశేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కిరికెర మూర్తి, మల్లికాబాను, వీరా, డాక్టర్ ఫక్రుద్దీన్, రహమత్, పాల్గొన్నారు.

స్టెప్పులేసిన ఇక్బాల్..

హిందూపురం: పట్టణంలో శనివారం సాయంత్రం 19వ వార్డులో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల అపూర్వ ఆదరణ లభించింది. రావాలి జగన్.. కావాలి జగన్ పాటకు ఎమ్మెల్సీ స్టెప్పులేశారు. స్థానిక నాయకుల్లో ఉత్సాహాన్ని నింపారు. అంతకు ముందు డప్పు వాయిద్యాల మధ్య బాణాసంచా కాల్చుతూ.. పూలు చల్లి హారతులతో ఎమ్మెల్సీని ఆహ్వానించారు. వార్డులో జయహో జగనన్న నినాదాలు మార్మోగాయి.



రావాలి జగన్ పాటకు డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, నాయకులు



ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్టం)
హిందూపురం : 30.0
పెనుకొండ : 31.0
మడకశిర : 30.0

సోమందేపల్లి ఎంఈఓ-2గా ఆనంద్‌బాబు

సోమందేపల్లి: మండల విద్యాధికారి-2గా ఆనంద్ బాబును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆనంద్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశముందని ప్రస్తుత ఎంఈఓ ఆంజినేయులు నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం

మడకశిర: విధి నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ఎంతగానో సహకారం అందించారని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న నరసింహమూర్తికి ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన్ను అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోనిబాయి, ఏఓ ఆరాధ్య, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీలు నరసింహమూర్తి, శ్రీరామరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిన్న పిల్లల వైద్యుల బృందం

హిందూపురం అర్బన్: మారుతున్న మన ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉండవచ్చని చిన్న పిల్లల వైద్యుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేశవులు పేర్కొన్నారు. శనివారం పూలకుంటలోని లోటస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పాఠశాల చైర్మన్ నీలకంఠారెడ్డి అధ్యక్షతన 4 ,5 తరగతుల విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఆ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉపేంద్ర కింజవడేకర్ వర్చువల్‌గా ముంబాయి నుంచి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ కేశవులు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, ఊపిరితిత్తుల సమస్యలను పిల్లలను ఎదుర్కొంటున్నారన్నారు. చదవుపై పడి మానిసిక రుగ్మతలకు గురవుతున్నారని తెలిపారు. హానికర మత్తు మందులు వాడటం, నిత్యం టీవీ, మొబైల్‌కు ఎక్కువ సమయం కేటాయించొద్దని సూచించారు. కంటి సంబంధిత వ్యాధులు చిన్న వయస్సులోనే వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు రామచంద్ర రావు, ప్రవీణ్, హరీష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి



లబ్ధిదారులకు సూచనలిస్తున్న అధికారులు

రొద్దం: ఇళ్ల బిల్లులను ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తోందని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. శనివారం మండల పరిధిలోని తురకలాపట్నంలో పావగడ-పెనుకొండ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో హౌసింగ్ డే నిర్వహించారు. లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్ మాట్లాడారు. పునాదులు, ఆపై గోడలు, పైకప్పు వేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి బిల్లులు మంజూరవుతాయన్నారు. మిగిలిన లబ్ధిదారులు కూడా నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. అదే విధంగా రొద్దం మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేక అధికారి నరసయ్య పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేశవ రెడ్డి, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ రంగస్వామి నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్, ఎంపీటీసీ మాధవి, కలిపి సింగిల్ విండో చైర్మన్ కేపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నారాయణ కళాశాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నారాయణ కళాశాలలో అత్యధిక ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. కళాశాలలో కేవలం ఒక్క కోర్సునే పెట్టుకుని ఎంసెట్, జేఈఈ, జెడ్ ఎఫ్2 అంటూ రూ.50 వేల దాకా ఫీజులు దండుకుంటున్నారన్నారు. విద్యను వ్యాపారం చేస్తూ ఇక్కడే మెటీరియల్ కొనుక్కోవాలని చెబుతున్నారన్నారు. అదనంగా రూ.7 వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు దేవరాజ్, పవన్, మోన్, జితేంద్ర, మహేష్ పాల్గొన్నారు.

టీడీపీలో అసమ్మతి మంటలు

పెనుకొండ: భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో టీడీపీ చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం పెనుకొండకు చేరుకోనుంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీలోని ఇరువర్గాలు బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. మీరా మేమా అంటూ కత్తులు దూసుకుంటున్నారు. ఇప్పటికే వాట్సాప్ వేదికగా ఒకరి మీద ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని సీనియర్లు దాదాపుగా మాజీ ఎమ్మెల్యేకు దూరమైపోయారు. కొత్త తరం యువతను బీకే సిద్ధం చేసుకున్నారు. ఈ ఇరువురి మధ్య సోషల్ మీడియాలో జోరుగా విమర్శలు చేసుకుంటున్నారు. ఎవరికి వారు తమదే పై చేయి అనేలా ప్రచారం చేకుంటున్నారు. మాజీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ సవితమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే బీకే.పార్థసారథి ఎవరికి వారు టికెట్ కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. తమదే పై చేయి కావాలని సవితమ్మ వర్గీయులు భావిస్తుండగా.. మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప సైతం పరోక్షంగా మద్దతు ఇస్తున్నారు. మరో వైపు బీకే మాత్రం సవితమ్మతో పాటు ఆమె వర్గీయులను ఏ మాత్రం బేఖాతరు చేయడం లేదని తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాలు బీకే నేతృత్వంలో జరుగుతుండగా.. ఆ సమావేశాల్లో పాల్గొనే అవకాశాన్ని సవితమ్మ వర్గీయులు కోల్పోతున్నారు. కనీసం సమావేశం జరుగుతుందన్న విషయం సైతం సవితమ్మ వర్గీయులకు తెలపడం లేదు. దీంతో మాజీ ఎమ్మెల్యేపై వారిలో అసహనం రోజురోజుకు పెరిగి పోతోందనే ప్రచారం సాగుతోంది. పెనుకొండలో టీడీపీ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతోందనే విషయాన్ని అధినేత చంద్రబాబుకు తెలియజేయాలని అసమ్మతి నాయకులు నివేదికను సిద్ధం చేశారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యేను టార్గెట్‌గా చేసుకుని ఈ నివేదిక తయారైనట్లు తెలిసింది. ఇందులో పార్టీలోని సీనియర్ నాయకులు ఎంతమంది కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు? వారికి దక్కుతున్న గౌరవం తదితర విషయాలను ఈ నివేదికలో పొందుపరిచారని సమాచారం.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



రొళ్ల: సిబ్బందికి సూచనలిస్తున్న మండల స్పెషలాఫీసర్ రామ్మోహన్ రావు

చిలమత్తూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని వీరాపురం సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల స్థితి, పథకాల అమలుపై చర్చించారు.

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని నాగినాయని చెరువు తండాలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మండల ప్రత్యేక అధికారి అశ్వర్థ నాయక్, ఎంపీడీఓ నాగరాజు రావు మాట్లాడుతూ.. పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు.

రొళ్ల: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని మైనింగ్ ఏడీ, మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. ఎంపీపీ కవిత అధ్యక్షతన 'జగనన్న సురక్ష'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మడకశిరరూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను విజయవంతంగా నిర్వహించాలని జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర యాదవ్, ఎంఎల్ఓ రవితేజ్ తెలిపారు.

విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



లేపాక్షి: పురస్కారాలు అందుకున్న విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



అమరాపురం: విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతిలో పాఠశాల స్థాయిలో అధిక మార్కులు సాధించిన ఎల్‌కే.రాకేష్, బి.చందు, బి.నానిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి రూ.3 వేలు, రూ.2వేలు, రూ.1,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. మెడల్స్, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌మూర్తి, సీనియర్ అధ్యాపకులు వివేకానందరెడ్డి, సుందరరాజు, పాఠశాల కమిటి చైర్మన్ రామాంజినేయులు పాల్గొన్నారు.

అమరాపురం: విద్యార్థుల్లో పోటీ పెంచేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని హెచ్ఎం రఘు పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నాగమణి, పల్లవి, బి.మధుకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులకు మెడల్స్, ప్రశాంసాపత్రం అందజేసి, సన్మానించారు. అనంతరం హెచ్ఎం రఘు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలన్నారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సహకారం అందించాలని కోరారు. నిరంతరం చదవడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చాన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహమూర్తి, యంజేరప్ప, కృష్ణారెడ్డి, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు డివిజన్‌స్థాయి 'స్పందన'

హిందూపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 26న పెనుకొండ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకూ స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారులు, మండలాధికారులు పాల్గొనాలన్నారు. ప్రజలు కూడా స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవోదయ పాఠశాలకు ఎంపిక



కె.వర్షిణి

రొళ్ల: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ఎంపీఈఓ శైలజ కుమార్తె కె.వర్షిణి నవోదయ పాఠశాలకు ఎంపికైంది. ఇటీవల నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో వర్షిణి ఉత్తీర్ణత సాధించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేలం పాట వాయిదా

రొళ్ల: రత్నగిరి సచివాలయ ఆవరణలో శనివారం సాయంత్రం పంచాయతీ ఆధీనంలోని ఐదు కాంప్లెక్స్ భవనాలకు వేలంపాట నిర్వహించారు. వేలం పాటకు ప్రజలు హాజరుకాక పోవడంతో జూలై 1వ తేదీకి వేలాన్ని వాయిదా వేసినట్లు ఈఓఆర్డీ క్రిష్టప్ప తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.1,500 డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ రూరల్: శెట్టిపల్లిలో నాగేంద్ర నాయక్ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు శనివారం దాడి చేశారు. 7 కేస్‌ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎంఈఓలకు సన్మానం

మడకశిర: నూతనంగా నియమితులైన ఎంఈఓ-2 నరసింహమూర్తి, ప్రస్తుత ఎంఈఓ శ్రీనివాస భాస్కర్‌ను శనివారం యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, స్థానిక యూటీఎఫ్ నాయకులు నరసింహప్ప, ఈశ్వర్, నరసింహమూర్తి, ఓబన్న, రంగయ్య, దేవరాజు, నరసింహరాజు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం డిగ్రీ విద్యార్థులకు వరం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం టౌన్: నూతన విద్యావిధానం-2020 డిగ్రీ విద్యార్థులకు వరమని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక బాలయేసు డిగ్రీ కళాశాలలో నూతన విద్యావిధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా డిగ్రీ విద్యా విధానంలో నూతన పద్ధతులు ప్రవేశపెట్టారన్నారు. ఇందులో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో ఆనర్స్ డిగ్రీ ద్వారా విద్యార్థి నచ్చిన దాన్ని మేజర్ సబ్జెక్ట్‌గా తీసుకోవచ్చన్నారు. మిగిలిన వాటిని సబ్జెక్టుగా చదువుతూ, మల్టి డీసిప్లీనరీ, నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవచ్చని తెలిపారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త విధానం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. అనంతరం నూతన విద్యావిధానంపై తనీవ్ర్, జియావుల్లా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ శౌరి రెడ్డి, కరస్పాండెంట్ బాలప్రతాప్ రెడ్డి, లైబ్రేరియన్ శివరాం రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలు కలెక్టర్లు కావాలి



కార్మికుల పిల్లలకు విద్యా సామగ్రి కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: భవన నిర్మాణ కార్మికుల పిల్లలు బాగా చదువుకుని కలెక్టర్లు కావాలని ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ ఆకాంక్షించారు. స్థానిక టీపీఎస్ కార్యాలయంలో శనివారం విద్యా సామగ్రి కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు చెమటోడ్చి బతుకుతున్నారన్నారు. వారి శ్రమను వృథా చేయకుండా పిల్లలు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఉద్యోగాలు సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్మిక శాఖ అనేక సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. తాను కూడా పల్లెలోనే చదివి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినట్లు గుర్తు చేశారు. మంచి పాలన అందిస్తున్న సిద్ధరామయ్య సర్కారు సంక్షేమ పథకాలు అందించడంలో వెనుకాడదన్నారు. అనంతరం 9, 10, పియూ విద్యార్థులకు విద్యా సామాగ్రి కిట్లు అందించారు. జిల్లా కార్మిక శాఖాధికారి తేజావతి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి 200 కిట్లు మంజూరైనట్లు తెలిపారు. గుర్తింపు కార్డులు పొందిన కార్మికుల పిల్లలకు కిట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్మిక శాఖాధికారి అబ్దుల్ రవూఫ్, మున్సిపల్ కౌన్సిలర్లు సుదేశ్ బాబు, రవి, రాజేశ్, ముగదాళబెట్ట నరసింహయ్య, షా బాబు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పెనుకొండ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో శనివారం సాయంత్రం కియా పోలీసులు పర్యటించారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటరమణ హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవించాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం విక్రేతల అరెస్ట్

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన నాగరాజు, నరేంద్ర కొంత కాలంగా పట్టణంలోని మద్యాన్ని కొనగోలు చేసి గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శనివారం పోలీసులు నిర్వహించిన దాడి చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాగరాజు, నరేంద్రను అరెస్ట్ చేశారు. వారి నుంచి 30 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

'ఫ్రీ పాసు మహిళల'తో బస్సులు ఫుల్



కేఎస్ ఆర్టీసీ బస్సు ఎక్కడానికి ఎగబడుతున్న మహిళలు

పావగడ: కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కర్ణాటక ప్రభుత్వం శక్తి యోజన కింద మహిళలకు ఉచితగా ప్రయాణించే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. స్థానిక శనీశ్వర స్వామిని దర్శించుకునేందుకు చిత్రదుర్గం, చెళ్లకెర, దావణగెరె, శివమొగ్గ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు శనివారం పావగడకు తరలివచ్చారు. అయితే తిరుగు ప్రయాణంలో చిత్రదుర్గం బస్సులు ఎక్కడానికి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులో సీట్లన్నీ మహిళలతో నిండిపోయాయి. మరి కొంతమంది మహిళలు సీట్ల కోసం కుస్తీ పట్టాల్సి వచ్చింది. రోజుకు కేవలం నాలుగు ట్రిప్పులు మాత్రమే కేఎస్ ఆర్టీసీ బస్సులు ఆ రూట్లలో నడుపుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా.. ఈనెల 11 నుంచి 21వ తేదీ వరకూ 55 వేల మంది మహిళలు బెంగళూరు, తుమకూరు, ధర్మస్థలం, చిత్రదుర్గం తదితర ప్రాంతాలకు ప్రయాణించినట్లు డిపో మేనేజర్ హనుమంతరాయప్ప తెలిపారు.